# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 15-05-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- పాకిస్థాన్‌తో భవిష్యత్‌లో ఎలాంటి చర్చలు జరిగినా ఉగ్రవాదానికి సంబంధించిన అంశాలపైనే ఉంటాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు.

- పాకిస్థాన్ దగ్గర ఉన్న అన్ని అణుబాంబులను ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్వాధీనం చేసుకోవాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు.

- ఆపరేషన్ సింధూర్ ద్వారా భారత సైన్యం అసమానమైన శౌర్య ప్రతాపాలు చూపించిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన లాల్ శర్మ కొనియాడారు.

- తెలంగాణలో సరస్వతీ నది పుష్కరాలు ఈ రోజు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25న ప్రసారమవుతుంది.

===================

పాకిస్థాన్‌తో భవిష్యత్‌లో ఎలాంటి చర్చలు జరిగినా ఉగ్రవాదానికి సంబంధించిన అంశాలపైనే ఉంటాయని భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ స్పష్టం చేశారు. ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రవాద మౌలిక సదుపాయాలను విజయవంతంగా ధ్వంసం చేశామని, నిర్దేశించుకున్న లక్ష్యాలను భారత్ సాధించిందని ఆయన పేర్కొన్నారు. ఢిల్లీలో హోండురాస్ రాయబార కార్యాలయ ప్రారంభోత్సవం అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ… పాకిస్థాన్ ఉగ్రవాద మౌలిక సదుపాయాలను పూర్తిగా మూసివేయాలని కోరారు. ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్‌కు అంతర్జాతీయంగా విస్తృతస్థాయిలో మద్దతు లభించిందని విదేశాంగ మంత్రి గుర్తు చేశారు. పాకిస్థాన్ భారత్ వ్యవహారాలలో మూడవ పక్షం జోక్యం చేసుకోవాల్సిన అవసరం లేదని జైశంకర్ స్పష్టం చేస్తూ…

(వాయిస్ 31 సెకన్లు)

===================

పొరుగు దేశంలో ఉగ్రవాద శిబిరాలను ధ్వంశం చేయడం ద్వారా భారత సైన్యం అసమానమైన శౌర్య ప్రతాపాలు చూపించిందని రాజస్థాన్ ముఖ్యమంత్రి భజన లాల్ శర్మ కొనియాడారు. ఆ రాష్ట్ర రాజధాని జైపూర్‌లో ఆపరేషన్ సిందూర్ విజయం సందర్భంగా ఈరోజు తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు మదన్ రాఠోర్, రాష్ట్ర మంత్రులు, ఆధ్యాత్మిక నాయకులు, NCC విద్యార్థులు, వివిధ సామాజిక వర్గానికి చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ... భారత జవాన్లకు సంఘీభావం తెలియచేయాల్సిన తరుణం ఇదనీ అన్నారు. వారికి భారత జాతి అండగా ఉండాలని కోరారు.

===================

పాకిస్థాన్ దగ్గర ఉన్న అన్ని అణుబాంబులను ఇంటర్ నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్వాధీనం చేసుకోవాలని రక్షణ మంత్రి రాజ్ నాథ్ సింగ్ విజ్ఞప్తి చేశారు. "ఆపరేషన్ సిందూర్" విజయవంతం అయిన తర్వాత రాజ్‌నాథ్ సింగ్ మొదటిసారిగా జమ్మూకాశ్మీర్‌లో ఈ రోజు పర్యటించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాధ్యత లేని పాకిస్తాన్ లాంటి దేశం దగ్గర అణుబాంబులు ఉండటం మంచిది కాదని అన్నారు. ఆపరేషన్ సిందూర్ ఉగ్రవాదులకు వ్యతిరేకంగా చేసిన అతి పెద్ద పోరాటంగా పేర్కొన్నారు. ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి భారతదేశం ఎంతవరకైనా వెళ్తుందని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేస్తూ..

(వాయిస్ 33 సెకన్లు)

===================

తెలంగాణలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో సరస్వతీ నది పుష్కరాలు ఈ రోజు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గోదావరి, ప్రాణహిత నదులతో పాటు అంతర్వాహినిగా ప్రవహించే సరస్వతీ నది కలిసే త్రివేణి సంగమం వద్ద నిర్వహిస్తున్న పుష్కర వేడుకలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ రోజు సాయంత్రం పవిత్ర త్రివేణి సంగమంలో పుష్కర స్నానం ఆచరించారు. జ్యోతిష్య శాస్త్రం ప్రకారం, బృహస్పతి మిథున రాశిలోకి ప్రవేశించడంతో సరస్వతీ నదికి పుష్కరాలు వస్తాయి. ఈ పుష్కరాలు ఈ నెల 26వ తేదీ వరకు కొనసాగుతాయి.

కాగా... సరస్వతి నది పుట్టిన ప్రదేశం భారతదేశం చివరి గ్రామంగా పేరొందిన ఉత్తరాఖండ్ చమోలీ జిల్లాలోని మానా గ్రామం. ఇది భారత్, టిబెట్ సరిహద్దులో ఉంది. అలాగే ప్రయాగరాజ్ లోని త్రివేణి సంగమంలో కూడా సరస్వతి నది పుష్కర పుణ్యస్నానాలు చేస్తారు. రాజస్థాన్ లో కూడా ఈ సరస్వతి నది అంతర్వాహినిగా ప్రవహిస్తుంది.

===================

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ న్యూఢిల్లీలో ఈ రోజు నిర్వహించిన ఒక సమావేశంలో దేశీయ మత్స్య రంగంలో పురోగతిని సమీక్షించారు. అమలవుతున్న నూతన ప్రణాళికలను గురించి అధికారులు వివరించారు. కేంద్ర మత్స్య శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ఇతర ఉన్నత అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

విరామం

===================

కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ రోజు న్యూఢిల్లీ లోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్)ను సందర్శించారు. ఈ సందర్భంగా చత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దులలో 21 రోజుల పాటు నిర్వహించిన నక్సల్ వ్యతిరేక ఆపరేషన్ లో పాల్గొని గాయపడిన భద్రతా సిబ్బందిని పరామర్శించారు. వారి ఆరోగ్యా పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకున్నారు.

===================

జమ్మూ కాశ్మీర్‌లోలోని పుల్వామా జిల్లా అదిత్యపోరలోని నాదర్ త్రాల్ ప్రాంతంలో ఉగ్రవాదులు భద్రతా బలగాలు మధ్య జరిగిన కాల్పులలో ముగ్గురు ఉగ్రవాదులు మృతి చెందారని అధికారులు తెలిపారు. ఉగ్రవాదుల ఉనికి గురించి ప్రత్యేకమైన సమాచారంతో భారత జవాన్లు, జమ్మూకాశ్మీర్ పోలీసులు, సీఆర్పీఎఫ్ సంయుక్తంగా ఉగ్రవాదుల మీద కాల్పులు జరిపారు.

==================

వక్ఫ్ సవరణ చట్టం 2025 రాజ్యాంగ చెల్లుబాటును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌లపై ఈ నెల 20న విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ఈ రోజు వెల్లడించింది. ఈ కేసులో మధ్యంతర ఉపశమనం అవసరమా కాదా అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని కూడిన ధర్మాసనం పరిశీలించనుంది.

==================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 122వ సంచిక ఈనెల 25వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 23వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==================

భారత సైన్యం ఈ రోజు పశ్చిమ బెంగాల్‌లోని తీస్తా ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్‌లో తీస్తా ప్రహార్ ఎక్సర్ సైజ్ నిర్వహించింది. సైన్యానికి సంబంధించిన అనేక విభాగాలు ఈ విన్యాశాల్లో పాల్గొన్నాయి.

==================

దేశంలోని అన్ని ప్రైవేట్ విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు అమలు చేయాలని లోక్ సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బిహార్ లోని దర్భంగా లో ఈ రోజు ఏర్పాటు చేసిన శిక్షా న్యాయ్ సంవాద్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని చాలా రోజుల నుంచి కాంగ్రెస్ పార్టీ కోరుతోందని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు అంగీకరించడం మంచి పరిణామమన్నారు.

==================

గౌతమ బుద్ధుడు ప్రవచించిన సిద్ధాంతాలు విశ్వ జనీనమైనవని కేంద్ర సాంస్కృతిక పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో వైశాఖ బుద్ధ పూర్ణిమ దివస్ వేడుకలలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... వైశాఖ బుద్ధ పూర్ణిమ మతపరమైన పండుగ కాదని తెలిపారు. బుద్ధుని పవిత్ర స్థలాలను కాపాడడం మాత్రమే కాకుండా ఆయన ఉపదేశాలను కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందన్నారు. భారతదేశం నుంచి బుద్ధుడు ఇచ్చిన సందేశం ప్రపంచం నలుమూలలకూ విస్తరించిందని కేంద్ర మంత్రి గుర్తు చేశారు.

==================

ఖేలో ఇండియా యూత్  గేమ్స్ 2025 ముగింపు వేడుకలు ఈ రోజు బీహార్ రాజధాని పాట్నాలో జరిగాయి. ఈ గేమ్స్ లో మహారాష్ట్ర 158 పతకాలతో మొదటి స్థానంలో నిలవగా, 117 పతకాలతో హర్యానా రెండవ స్థానాన్ని దక్కించింది. 60 పతకాలతో రాజస్తాన్ మూడవ స్థానాన్ని పొందింది. కాగా, ఈ నెల 4వ తేదీన ప్రారంభమయిన ఖేలో ఇండియా గేమ్స్ పాట్నా, ఢిల్లీ నగరాల్లో జరిగాయి.

===================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు భారీ లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం  81,330 పాయింట్ల వద్ద స్వల్ప లాభాల్లో ప్రారంభమై.. చివరికి 1,200 పాయింట్ల లాభంతో 82,530 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 394 పాయింట్లు లాభంతో 25,061 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 85.52గా ఉంది. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ 63 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 3,177 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

===================

===================